క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామ సచివాలయ పరిధిలోని దామవాండ్లపల్లి, కె.పూలకుంట గ్రామాలలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ.సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కె.రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

రేపు ఉప్పర్లపల్లిలో గడప గడపకూ..

బత్తలపల్లి: మండలంలోని ఉప్పర్లపల్లిలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచు చల్లా కరుణాకర్ నాయుడు, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ దంపెట్ల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఒకరిని అరెస్టు చేసినట్లు కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కదిరి పట్టణం నిజాంవలి కాలనీకి చెందిన అమీర్‌బాషా, అంజీ, పవన్ కర్ణాటక నుంచి 45 కేసులు మద్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తీసుకొస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాంభూపాల్ తన సిబ్బందితో కలిసి బిళ్లూరివాండ్లపల్లి వద్ద పట్టుకున్నారు. అయితే పోలీసులను చూడగానే అంజీ, పవన్ పరారు కాగా అమీర్‌బాషాను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు రివార్డు అందజేత

కదిరి అర్బన్: గతేడాది నవంబర్, డిసెంబర్‌లో కదిరి డిపోలో అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన మహిళా కండక్టర్ సుమలతకు బుధవారం డీఎం మైనోద్దీన్ రూ. 1,000 నగదు రివార్డు అందజేసి అభినందించారు. నవంబర్‌లో 112.94, డిసెంబర్‌లో 121.16 శాతం ఆదాయం తీసుకొచ్చినందుకు రివార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌లు హరిత, హరిమోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. బుధవారం మండలంలోని పోట్లమర్రి గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా చెన్నేకొత్తపల్లి మండలం చందమూరుకు ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్ వచ్చినట్లు వివరించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


సజావుగా ఇంటర్వ్యూలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. ఆర్డీఓ తిప్పేనాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వి సాల్మన్, సీడీపీఓ లక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపుతామని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. త్వరలో కలెక్టర్ కార్యాలయం నుంచి అర్హుల జాబితా ప్రకటిస్తారన్నారు.

అడవులకు నిప్పు పెడితే క్రిమినల్ కేసులు

తాడిమర్రి: అడవులకు నిప్పు పెడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని దాడితోట అటవీశాఖ బీట్ ఆఫీసర్ సూర్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గొర్రెల మేత, తేనె తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో దాడితోట, చిల్లవారిపల్లి మధ్య ఉన్న ఫారెస్టు రేంజ్‌ను శ్రీసత్యసాయి జిల్లాలోని బుక్కపట్నం ఫారెస్టు రేంజ్‌లోకి మార్చినట్లు తెలిపారు. అడవులకు నిప్పు పెట్టే దుండగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన గొర్రెల కాపరులు, పశువుల కాపర్లకు సూచించారు.

వైఎస్సార్ సీపీ 'కొత్తచెరువు' కన్వీనర్‌గా జగన్మోహన్ రెడ్డి



కొత్తచెరువు: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా రెండో సారి కూడా నారేపల్లి జగన్మోహన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ మండల కమిటీని ఎంపిక చేశారు. కన్వీనర్‌గా నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అజీజ్, జీ.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.మహేష్ రెడ్డి, వి.వెంకటేష్, లింగమయ్య, కోశాధికారిగా పి.వెంకటశివారెడ్డి, కార్యదర్శులుగా లక్ష్మినారాయణ రెడ్డి, పి.విశ్వనాథ్, మల్లికార్జున, బి.రామసుబ్బారెడ్డి, ఎస్.సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.శ్రీనివాసులు, ఎం.కొండమీద రాయుడు, కె.సురేష్, పి.చెక్కీరప్ప, డి.ఓబిలేసు, సి.వెంకటరాముడు, ఎస్.గంగ్రాధి, ఎస్.ఎం.నాగేంద్ర, రాంభూపాల్ రెడ్డి, కె.తిరుపాలు, శివారెడ్డి, బి.పోతన్న, ఎ.నిర్మల, బి.రమేష్, సి.రామాంజినేయులు, కె.శంకర, సి.పుల్లా రెడ్డి, వి.చంద్రాయుడును ఎన్నుకున్నారు.

బడ్జెట్ @ రూ.50.71 కోట్లు

- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- ఆమోదం తెలిపిన ధర్మవరం పాలకవర్గం
- టీడీపీ హయాంలో కంటే గణనీయంగా పెరిగిన ఆదాయం



మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల సమక్షంలో బడ్జెట్‌లోని అంశాలను చదివి వినిపిస్తున్న జేఏఓ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యుడు

ధర్మవరం: వైఎస్సార్ సీపీ పాలకవర్గం కొలువుదీరినప్పటి నుంచి ధర్మవరం మున్సిపాలిటీ ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముందు చూపు, పాలకవర్గం సమష్టి కృషితో ఆదాయ మార్గాలను పెంచుకుంటోంది. పారదర్శకంగా పన్నుల వసూలు, గృహ నిర్మాణాలకు అనుమతులివ్వడం ద్వారా గత పాలకవర్గాని కంటే అధికంగా ఆదాయాన్ని సముపార్జిస్తూ ప్రజలకు అభివృద్ధి ఫలాలు చేరవేసేందుకు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ధర్మవరం మున్సిపాలిటీ 2023–24 బడ్జెట్‌ను రూ.50.71 కోట్లతో రూపకల్పన చేసింది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ లింగం నిర్మల అధ్యక్షతన కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. తొలుత జేఏఓ శ్రీనివాసులు బడ్జెట్‌లోని అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. 2023–24 వార్షిక బడ్జెట్ రూ.50.71 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ఇందులో ప్రారంభ నిల్వ రూ.26,07,06,498 కాగా రెవెన్యూ, క్యాపిటల్ వసూళ్లు రూ.56,00,66,350, రెవెన్యూ, క్యాపిటల్ వ్యయం రూ.50,71,98,840, ముగింపు నిల్వ రూ.31,35,74,008గా ఉంది. ఈ యేడాది మిగులు బడ్జెట్ రూ.5.28 కోట్లు ఉన్నట్లు జేఏఓ తెలిపారు.

గత పాలకవర్గం కంటే మెరుగ్గా ఆదాయం..

ధర్మవరం మున్సిపాలిటీ టీడీపీ హయాంలో పూర్తిగా వెనుకబాటుకు గురైంది. గతంలో రూ.40 కోట్ల దాకా విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో వడ్డీకి వడ్డీ పెరిగి తడసిమోపెడయ్యేది. అప్పట్లో యేడాదికి టౌన్‌ప్లానింగ్ విభాగంలో మున్సిపాలిటీకి కేవలం రూ.1.30 కోట్లు వచ్చేది. నూతన గృహాలకు అనుమతులు ఇవ్వాలంటే టీడీపీ పాలకవర్గం మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టి లంచాలు తీసుకుని అనుమతులు ఇచ్చేయడమే ఇందుకు కారణం. ప్రస్తుతం సచివాలయాల ద్వారా మున్సిపాలిటీలో ఎక్కడా కూడా అవినీతికి తావు లేకుండా నిబంధనల ప్రకారం సెస్‌చార్జీలు వసూలు చేసి యేడాదికి టౌన్‌ప్లానింగ్ ఆదాయాన్ని రూ.7 కోట్లకు పెంచారు. పెండింగ్ ఉన్న విద్యుత్ బకాయిలు రూ.26 కోట్లను కూడా చెల్లించి రూ.5.28 కోట్లు మిగులు బడ్జెట్‌గా చూపడం గమనార్హం.

జీఓ నంబర్ 265 ప్రకారం కేటాయింపులు..

ఈ యేడాది బడ్జెట్‌కు సంబంధించి జీఓ నంబర్ 265 ప్రకారం మురికివాడల అభివృద్ధికి 40 శాతం నిధులు, షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 7.5 శాతం, స్త్రీ, శిశు సంరక్షణకు 5 శాతం, విభిన్న ప్రతిభావంతులకు 3 శాతం కచ్చితంగా ఖర్చుచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

మౌలిక వసతుల కల్పనకు పక్కా ప్రణాళిక..

మున్సిపల్ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి మౌలిక వసతుల కల్పనకు రూ.19 కోట్లు దాకా ఖర్చు చేశారు. అన్ని వార్డుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఈ బడ్జెట్ నుంచి కూడా సమధిక నిధులు ఖర్చు పెట్టేలా ప్రణాళిక రచించారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతో అభివృద్ధికి శ్రీకారం

మున్సిపాలిటీకి ఆదాయాన్ని సముపార్జించేందుకు నూతన కాంప్లెక్స్‌ల నిర్మాణం, వాటి అద్దెలతో ఆదాయాన్ని పెంచడం, పారదర్శకంగా టౌన్ ప్లానింగ్ విభాగం పనులు, పన్నుల వసూలు, అనవసర ఖర్చులను నియంత్రించడం వంటి చర్యలను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా చేపట్టింది. మున్సిపాలిటీని అగ్రస్థానంలో నిలిపేలా ఎన్నో సంస్కరణలు విజయవంతంగా అమలు చేసింది.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

మున్సిపాలిటీలో ఈ యేడాది బడ్జెట్‌పై జరిపే చర్చకు సంబంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల ప్రసంగించగా కౌన్సిలర్‌లు చందమూరి నారాయణరెడ్డి, గోరకాటి పురుషోత్తం రెడ్డితో పాటు పలువురు సభ్యులు ఎమ్మెల్యే కేతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచి గ్రేడ్ సాధించాలి

రామగిరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను ఎంఈఓ సాయికృష్ణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మోడల్ పేపర్లను సాధన చేసి, మంచి గ్రేడ్ సంపాదించాలన్నారు. హెచ్‌ఎం ప్రమీల, యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, సురేష్, వెంకటకృష్ణ, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



ధర్మవరం: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో లక్షార్చన, అన్నదానం, గ్రామోత్సవ నిర్వహణకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ రూ.20 వేలు విరాళం అందించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు..

ధర్మవరం రూరల్: నడిమిగడ్డపల్లి ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న పెద్దమ్మ దేవాలయానికి బుధవారం కేతిరెడ్డి సుప్రియ రూ. 50 వేలను విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో గ్రామ పెద్దలకు నగదు అందించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

- ఎమ్మెల్యే సిద్దారెడ్డి



గ్రామీణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎగువపల్లి సచివాలయం పరిధిలో కే. బత్తలపల్లి, శ్రీరామ్‌పూర్, దిగువపల్లి, చిన్న దిగువపల్లి గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం ఇప్పటికే అమలు చేశామని చెప్పారు. ఇవ్వని హామీలను సైతం అమలు చేసి ప్రజాదరణ పొందుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సత్వరం అందాలనే ఉద్దేశంతో సచివాలయాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలు: హంద్రీనీవా నీటి కాలువ లీకేజీతో తమ గ్రామంలోకి నీరువస్తున్నాయని కే. బత్తలపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నిత్యం నీరు నిల్వ ఉండడంతో గోడలు బీటలు వారుతున్నాయని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కాలువ లీకేజీని అరికట్టాలని హంద్రీనీవా జేఈ హతీరామ్‌నాయక్‌ను ఆదేశించారు. తమ గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్లను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరగా ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అలాగే కొందరు తమకు పొజిషన్ సర్టిఫికెట్లు కావాలని కోరగా అర్హులకు మంజూరు చేయాలని వీఆర్‌ఓను ఆదేశించారు. మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, జెడ్పీటీసీ రాధాబాయ్, మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపీటీసీ శివకుమార్‌నాయుడు, మణికంఠనాయక్, టెంపుల్ చైర్మన్ గోపాల క్రిష్ణ, వైస్ ఎంపీపీ ఆనంద్ నాయక్, నాయకులు మధుకర్‌రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల కళ్లలో ఆనందం

పాడి రైతుల కళ్లలో ఆనందం చూడడం కోసమే జగనన్న పాలవెల్లువ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. పథకం ప్రారంభమై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పాడి రైతులు బుధవారం మండల పరిధిలోని గంగమ్మమోరీ వద్దనున్న జగనన్న పాలవెల్లువ కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనాడు ప్రవేట్ డెయిరీలు పాడిరైతులను నిలువు దోపిడీ చేశాయన్నారు. జగనన్న పాల వెల్లువ పథకంతో లీటర్‌కు పాడిరైతులకు రూ. 7 నుంచి 8 వరకూ ఆదాయం వస్తోందన్నారు. అనంతరం జగనన్న పాలవెల్లువ కేంద్రాల్లో అత్యధికంగా పాలు పోస్తున్న పాడి రైతులను దుశ్శాలువాతో సన్మానించారు. తొలుత పాల వెల్లువ కేంద్రంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రకాష్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ తదితరులున్నారు.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా దేవి, డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మల ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు సంక్రాంతి పండుగ శోభ ఉట్టిపడేలా రంగురంగుల ముగ్గులు వేస్తూ సంబరాలు చేసుకున్నారు. గొబ్బెమ్మలు, భోగి మంటలు, పాల పొంగులతో పండుగను ఘనంగా నిర్వహించారు. హరిదాసు వేషధారణలో చిన్నారులు అలరించారు. సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

- దుర్గానగర్‌లోనున్న శ్రీ గాయత్రి పాఠశాలలో కరస్పాండెంట్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేసి భోగిమంటలు, పాలపొంగులు తదితర సంక్రాంతి సంబరాలు చేశారు.

ముగ్గుల పోటీలు

కదిరి టౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి ఆధ్వర్యంలో కుంజేటి ఎలక్ట్రానిక్స్ సౌజన్యంతో స్థానిక తేరు బజారులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 75 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కదిరి అర్బన్ సీఐ మధు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్బరాజుగుప్తా, మేడ వరప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షులు రంజిత్ తదితరులున్నారు.

పాఠశాలలో ముగ్గుల పోటీ

నల్లమాడ: మండలంలోని మసకవంకపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం చాంప్లానాయక్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. 5,6,7 తరగతులకు చెందిన 15 మంది విద్యార్థినులు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు తస్లీమ్‌భాను, కవిత, భారతి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మనీష, లావణ్య, క్రిష్ణకుమారికి హెచ్‌ఎం, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికలో రూ.61 వేల రికవరీ

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజా వేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఎంపీడీఓ విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ రామాంజినేయులు, డీవీఓ రమణారెడ్డితో పాటు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉపాధి పథకంలో జరిగిన పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై గత 15 రోజులుగా నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన అంశాలను డీఆర్పీలు సభలో వెల్లడించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ రామాంజినేయులు మాట్లాడుతూ మండలంలో రెండేళ్లుగా జరిగిన ఉపాధిహామీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, ఉద్యాన శాఖ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మొక్కల పెంపకం, వైఎస్సార్ పింఛన్ కానుక, విద్యార్థులకు ఉపకార వేతనాలు తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించారన్నారు. 15వ రౌండ్ (2020 ఏప్రిల్ 1 నుంచి 2021 మార్చి 31 వరకు)లో సుమారు రూ.9.77 కోట్ల నిధులు, 16వ రౌండ్ (2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు)లో రూ.9.11 కోట్ల నిధులకు సంబంధించి జరిగిన పనుల్లో తనిఖీలు చేయగా ఉపాధిహామీ పనులు రూ.43 వేలు, ఇందిరా క్రాంతి పథకం ఆధ్వర్యంలో జరిగిన మొక్కల పెంపకం బిల్లులు రూ.1,800 దుర్వినియోగం అయినట్లు గుర్తించారన్నారు. క్షేత్ర సహాయకుల నుంచి ఆ నిధులను రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వెంకటాచలం, ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీలు ఆశోక్‌కుమార్ రెడ్డి, హరిబాబు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రేనాటి వీరుడు వడ్డే ఓబన్నకు ఘన నివాళి

బత్తలపల్లి: రేనాటి వీరుడు, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో రాష్ట్ర వడ్డెర యువ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు గోగుల మూర్తి వడ్డే ఓబన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నారికేళాలను సమర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ దేరంగుల ప్రతాప్, దేరంగుల చంటి, స్టోర్ డీలర్ గోగుల వన్నూరయ్య, దేరంగుల అశోక్, శంకర్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి టౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం నాయకులు గోవర్ధన్, రమణ, బాబు, గంగాధర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలను కొత్తచెరువులో వడ్డెర కులస్తులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

మున్సిపల్ ఏసీగా మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ సహాయ కమిషనర్ (ఏసీ)గా మధుసూదన్‌రెడ్డి బుధవారం బాధ్యతలను చేపట్టారు. నందికొట్కూరు కమిషనర్‌గా ఉన్న మధుసూదన్ రెడ్డి బదిలీపై ధర్మవరం మున్సిపాలిటీకి వచ్చారు. కమిషనర్ మల్లికార్జున, మేనేజర్ ఆనంద్, కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వేపరాల మాజీ సర్పంచ్ వద్దిరెడ్డి కొండారెడ్డి మృతి

గాండ్లపెంట: వేపరాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వద్దిరెడ్డి కొండారెడ్డి (80) బుధవారం రాత్రి స్వగృహంలో కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్‌గా కొండారెడ్డి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. మృతుడికి భార్య లలితమ్మ, కుమారుడు, కుమార్తె ఉండగా కుమార్తె, అల్లుడు అమెరికాలో వైద్యులుగా స్థిరపడ్డారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తాడిమర్రి: సంకాంత్రి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాటను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. చిల్లకొండయ్యపల్లిలో బుధవారం ఆయన అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే 9440901893 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇస్తే పేరు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జైలుకు పంపుతాం

అమడగూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించినా, పేకాట ఆడినా, ఇతర వ్యసనాలకు పాల్పడి వీధుల్లో గొడవలకు దిగినా ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు.

పంటలను ఈ–క్రాప్ చేయించుకోండి

కనగానపల్లి: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాపింగ్ చేయాలని ఏడీఏ కృష్ణయ్య వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం రబీ పంటల సాగు, ఈ– క్రాప్ నమోదుపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించండి

కదిరి అర్బన్: కదిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈకేవైసీ చేయించుకోని రైతులు ఈ నెల 14 లోపు ఈకేవైసీ చేయించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కదిరి సబ్ డివిజన్‌లో ఇప్పటివరకూ మొత్తం రైతులు 92,139 మంది ఉండగా, 65,406 మంది (72 శాతం) ఈకేవైసీ చేసుకున్నారని పేర్కొన్నారు.

సంక్రాంతి సెలవులు వచ్చేశాయ్..

కనగానపల్లి: మండలంలోని పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు సంతోషంగా ఇళ్లకు వెళ్లారు. స్థానిక కేజీబీవీ, మోడల్ స్కూళ్ల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో గ్రామాలకు తరలివెళ్లారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ఓడీ చెరువు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో బుధవారం నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. అమడగూరు మండలం కందుకూరిపల్లికి చెందిన ఈశ్వరప్ప నడుచుకుంటూ రోడ్డుపై వెళ్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై ఢీ కొట్టి వెళ్లాడు. దీంతో ఈశ్వరప్ప కాలికి, చేతులకు రక్తగాయాలయ్యాయి. 108 ద్వారా కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిసింది.

ఘనంగా వారోత్సవాలు

ధర్మవరం రూరల్:మండల పరిధిలోని పోతులనాగేపల్లిలో బుధవారంఏకల్ అభియాన్ మాతాశ్రీ లక్ష్మిదేవి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నం అరవింద్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల విడుదల

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద బుధవారం ఎంఈఓ సుధాకర్ నాయక్ ఎస్టీయూ 2023 సంవత్సరం క్యాలెండర్, స్టిక్లర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శుగుమంచి సురేష్‌బాబు, కార్యదర్శి కోటకొండ శ్రీనివాసులు, ఈశ్వరయ్య, ఆంజినేయులు, గోపాల్, మహబూబ్‌బాషా, భారతి, అనిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ ఏడాది ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

నాణ్యంగా మధ్యాహ్న భోజనం

పుట్టపర్తి: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో నాణ్యంగా మధ్యాహ్న భోజనం అందిస్తోందని పుట్టపర్తి ఎంఈఓ వెంకటరమణ నాయక్ అన్నారు. ఆయన బుధవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో శివాలయం వీధిలో ఉన్న మైన్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రజనీకాంత్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో గీతం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రోగులకు అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్, రాజేశ్వరి దంపతుల సహకారంతో గీతం సేవ ట్రస్ట్ సభ్యులు రోగులు, బంధువులకు అన్నదానం చేశారు. సేవా కార్యక్రమాలలో ముందుంటామని గీతం సేవ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.